సాక్షి రంగారెడ్డి

శనివారం ၊ 11 ၊ మార్చి ၊ 2023



కేసీఆర్‌కు సంఘాల వత్తాసు
ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యా వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించారని బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. 8లో▸



ఆటోలో చెలరేగిన మంటలు
ఆగి ఉన్న సెవెన్ సీటర్ ఆటోలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ప్రయాణికులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. 8లో▸



వైజ్ఞానిక సదస్సులతో నైపుణ్యం
వైజ్ఞానిక సదస్సులు నిర్వహించడం ద్వారా విద్యార్థులల్లో నైపుణ్యం పెరుగుతుందని డీఆర్‌డీవో సైంటిస్ట్ డాక్టర్ రఘు అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ రాజేశ్వరి

కొందుర్గు: హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించిన ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం షాద్‌నగర్ ఆర్డీఓ రాజేశ్వరి పరిశీలించారు. కొందుర్గు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సెంటర్‌ను సందర్శించి, ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండలాలకు సంబంధించిన ఉపాధ్యాయ ఓటర్లు ఇక్కడ ఓటు హక్కును వినియోగించుకుంటారని తెలిపారు.

హై కోర్టు తీర్పుపై సుప్రీం స్టే

నందిగామ: మండల పరిధిలోని అంతిరెడ్డిగూడ గ్రామ పంచాయతీకి ఎనిమిది వారాల్లో ఎన్నికలు నిర్వహించాలని ఇటీవల హై కోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీం కోర్టు తాజాగా స్టే విధించింది. దీంతో కొంత కాలంగా అంతిరెడ్డిగూడ సర్పంచ్ కావాలనుకుంటున్న నాయకుల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. వివరాలు ఇలా ఉన్నాయి.. నందిగామకు అనుబంధ గ్రామంగా ఉన్న అంతిరెడ్డిగూడను ప్రత్యేక పంచాయతీగా గుర్తించకపోవడంపై కొంతమంది హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై స్పందించిన న్యాయ స్థానం 8 వారాల్లో ఎన్నికలు నిర్వహించాలని, తక్షణమే ఈప్రక్రియను ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో సంబంధిత అధికారులు ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటు, రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఇదిలా ఉండగా నందిగామ సర్పంచ్ జిలెల్ల వెంకట్‌రెడ్డి హై కోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీంతో ఎన్నికలపై ఈ నెల 3నుంచి 4 వారాల వరకు అత్యున్నత న్యాయస్థానం స్టే విధించిందని ఎంపీడీఓ బాల్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఎన్నికల సంఘం నుంచి తమకు ఆదేశాలు అందాయన్నారు.

బీజేపీపై ప్రజా తిరుగుబాటు తప్పదు

ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి మందా జగన్నాథ్ హెచ్చరిక



మాట్లాడుతున్న మందా జగన్నాథ్

ఆమనగల్లు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకుని ప్రతిపక్ష పార్టీలపై కుట్రలు చేస్తోందని, ఈ అరాచకాలు ఇలాగే కొనసాగిస్తే మోదీ ప్రభుత్వంపై ప్రజా తిరుగుబాటు తప్పదని బీఆర్‌ఎస్ నేత, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి మందా జగన్నాథ్ హెచ్చరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎదుర్కోలేక ఆయన కుటుంబ సభ్యులను వేధిస్తున్నారని చెప్పారు. ఆమనగల్లులో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతున్న సీఎం కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోవడం చేతకాని బీజేపీ.. దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకుని కవితను టార్గెట్ చేసిందన్నారు. రాజకీయ లబ్ధి కోసం బీజేపీ ప్రయత్నిస్తోందని, బీజేపీయేతర ప్రభుత్వాలను అస్థిర పరచేందుకు సీబీఐ, ఈడీ, ఐటీ వంటి సంస్థలను వాడుకుంటోందని ఆయన విమర్శించారు. దీన్ని ప్రజలు గమనిస్తున్నారని, బీజేపీకి ప్రజాక్షేత్రంలో తగిన శిక్ష తప్పదని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు వస్పుల జంగయ్య, భీమయ్య, రమేశ్ పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించండి



వాల్‌పోస్టర్‌ను వైద్యులు, సిబ్బంది

తుక్కుగూడ: వాతావరణంలో సంభవించే మార్పుల కారణంగా వచ్చే ఆరోగ్య సమస్యలు, పరిష్కార చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. వడదెబ్బ ద్వారా పిల్లలకు సంక్రమించే వ్యాధులు, గర్భిణులకు ఎదురయ్యే ప్రసవ సంబంధ సమస్యలపై అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని దవాఖానాల్లో ఇది అమలు చేయాలని ఆదేశించారు. వాల్ పోస్టర్, కరదీపికలను ఆవిష్కరించారు. జిల్లా టీబీ అధికారి అరుణకుమారి, స్వర్ణలత, అరుణ్, రాకేష్, సోలమన్, అనిత, వినోద్, సృజన, జయలక్ష్మి, గీత, దామోదర్ పాల్గొన్నారు.

వైద్యానికి సుస్తీ

మారుమూల ప్రాంతమైన జిల్లెడుచౌదరిగూడ మండల కేంద్రం ఇది. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సుదూరంలో ఉంటుంది. ఇక్కడ రైతులు, కూలీలు, ఇతర నిరుపేదలే అధికం. పల్లెదవాఖానా, వైద్యులు అందుబాటులో లేకపోవడంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. దగ్గు, జలుబు, జ్వరం, కడుపునొప్పి వంటి చిన్న ఆరోగ్య సమస్యలు తలెత్తినా నగరానికి పరుగెత్తాల్సిందే. జిల్లాలోని అనేక మారుమూల ప్రాంతాల ప్రజలందరిదీ ఇదే దుస్థితి.



జిల్లేడ్ చౌదరిగూడ

మారుమూల ప్రాంతాల్లో అందని సేవలు

- మంచం పడుతున్న పల్లెలు.. నగరానికి పరుగులు
- జిల్లాకు 84 పల్లె దవాఖానాలు మంజూరు
- పని చేసేందుకు ముందుకురాని డాక్టర్లు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: పల్లె వైద్యానికి సుస్తీ చేసింది. ఇన్‌ఫ్లుయెంజా కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ప్రస్తుతం ఏ ఇంట్లోకి తొంగి చూసినా జ్వరపీడితులే దర్శనమిస్తున్నారు. మారుమూల ప్రాంతాల్లోని బాధితులకు కనీస వైద్యసేవలు అందడం లేదు. పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు.. వనస్థలిపురం, కొండాపూర్ వంటి ఏరియా ఆస్పత్రులు అందుబాటులో ఉన్నా.. ఆశించిన మేర సేవలు అందడం లేదు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో నగరంలోని ఫీవర్, ఉస్మానియా, గాంధీ, నిలోఫర్ వంటి పెద్దాస్పత్రులకు పరుగులు తీయాల్సి వస్తోంది. ఆర్థికంగా ఉన్నవారు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.

పల్లెకు రాం.. రాం

ప్రస్తుతం జిల్లాలో 59 బస్తీ దవాఖానాల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటిలో ఇప్పటికే జీహెచ్ఎంసీ వార్డులు సహా శివారు మున్సిపాలిటీల్లో 46 వరకు ఏర్పాటు చేసింది. మరో 35 పట్టణ ఆరోగ్య కేంద్రాలు పని చేస్తున్నాయి. వీటిలో సగానికిపైగా ఆస్పత్రుల్లో వైద్యులు లేరు. ఒక్కో డాక్టర్ రెండు మూడు ఆస్పత్రులను చూడాల్సి వస్తోంది. మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు సత్వర వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం తాజాగా పల్లె దవఖానాలను ఏర్పాటు చేయాలని భావించింది. ఈమేరకు ఆస్పత్రులు ఏర్పాటు చేసే ప్రాంతాలను ప్రకటించింది. వైద్య సిబ్బంది నియామకానికి నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. తీరా పోస్టింగ్ పొందిన కొద్ది రోజులకే వారిలో చాలా మంది పీజీ కోర్సుల పేరుతో ఉద్యోగాన్ని వదిలివెళ్లారు. అప్పటి నుంచి ఆయా పోస్టులు ఖాళీగా ఉండిపోయాయి. కొన్నిచోట్ల సీనియర్ స్టాఫ్ నర్సులతో ప్రాథమిక వైద్యసేవలు అందిస్తుండగా.. మరికొన్ని పల్లెల్లో కనీస సేవలు సైతం అందడం లేదు.

సీహెచ్‌సీల్లోనూ అంతంతే

జిల్లాలో 11 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. రోగులు ఎక్కువగా ఉండే ఆస్పత్రుల్లో వైద్యులు లేరు. వైద్యులు ఉన్న చోటకు రోగులు వెళ్లడం లేదు. ఫలితంగా ఆయా కేంద్రాల్లో ఆశించిన మేర వైద్య సేవలు అందడం లేదు. జిల్లావ్యాప్తంగా 108 అంబులెన్స్‌లు 22, పదకొండు అమ్మఒడి 102 వాహనాలు ఉన్నాయి. అయినప్పటికీ అత్యవసర పరిస్థితుల్లో రోగులు ప్రైవేటు వాహనాలను అద్దెకు తీసుకెళ్లాల్సివస్తోంది. ప్రస్తుతం హెచ్–1ఎన్–1 ఇన్‌ఫ్లుయెంజా వైరస్.. మారిన వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా హెచ్–3ఎన్–2గా రూపాంతరం చెంది పంజా విసురుతోంది. ఒక వైపు కోవిడ్.. మరో వైపు ఫ్లూ జ్వరాలతో జనం అల్లాడుతున్నారు. పల్లెల్లో ఉన్న వారికి ఆర్ఎంపీలే దిక్కవుతున్నారు. పట్టణాల్లో ప్రైవేటు క్లినిక్‌లు రద్దీగా కనిపిస్తున్నాయి.

జిల్లాలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు.. గతేడాది మార్చి–జనవరి 23 వరకు ఓపీ,ఐపీ

ఆస్పత్రులు	ఓపీ	ఐపీ
కొండాపూర్	1,76,645	8,990
వనస్థలిపురం	1,72,104	1,149
చేవెళ్ల	66,862	7,487
షాద్‌నగర్	96,253	10,741
హయత్‌నగర్	61,349	2,379
మహేశ్వరం	46,474	3,923
రాజేంద్రనగర్	75,975	2,066
శంషాబాద్	2,62,177	19,740
ఇబ్రహీంపట్నం	1,00,224	4,614
ఆమనగల్లు	79,696	5,760
యాచారం	47,280	4,808

అత్యవసర సేవలు అందడం లేదు



ఇటీవల ఓ కుక్క పది మంది వృద్ధులను కరిచింది. ఎటూ కదల్లేని స్థితిలో ఉన్న వారిని ఆస్పత్రికి తరలించేందుకు స్థానికంగా అంబులెన్స్ అందుబాటులో లేదు. చివరకు అదనపు కలెక్టర్‌కు ఫోన్ చేయాల్సి వచ్చింది. అత్యవసర పరిస్థితుల్లో 108 సేవలు కూడా అందడం లేదు. – కొప్పు సుకన్య, ఎంపీపీ

పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి



కల్వకుర్తి,ఇర్విన్, మాడ్గుల, తలకొండపల్లి,ఆమనగల్లు ఆరోగ్య కేంద్రాల్లో రోగుల నిష్పత్తి మేరకు వైద్యులు ఉండటం లేదు. కడ్తాల్‌లో ఆరోగ్య కేంద్రం లేదు. స్థానిక ప్రజల వైద్య అవసరాలను తీర్చేందుకు వెంటనే ఇక్కడ ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలి.
– జైపాల్ యాదవ్, ఎమ్మెల్యే, కల్వకుర్తి

మత్తు వైద్యుడు లేడు



జిల్లాలో పేదలు ఎక్కువగా ఉండే ప్రాంతం షాద్‌నగర్. ఇక్కడి ఆస్పత్రిలో అత్యధిక డెలివరీలు, సర్జరీలు అవుతుంటాయి. ఆపరేషన్ల సమయంలో మత్తు మందు ఇచ్చే వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో సర్జరీలకు ఆటంకం ఎదురవుతోంది.
– అంజయ్య యాదవ్, ఎమ్మెల్యే, షాద్‌నగర్

ప్రభుత్వ పెద్దల ఆశీస్సులు 34 సంఘాల మద్దతు నాకే

''ప్రభుత్వ పెద్దల ఆశీస్సులు, 34 ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల మద్దతు నాకే ఉంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయభేరి మోగిస్తా. విద్య, ఉపాధ్యాయుల సమస్యలపై కనీస అవగాహన లేని కొంతమంది డబ్బులతో ఓట్లు పొందాలని భావిస్తున్నారు. అలాంటివారికి తగిన సమాధానం చెప్పాల్సిన బాధ్యత సమాజ నిర్మాతలైన టీచర్లపైన ఉంది''.



మంచి మెజార్టీతో విజయం సాధిస్తా

- కార్పొరేట్ అధిపతి కావాలో.. సేవకుడు కావాలో ఆలోచించాలి
- 317 బాధితులకు న్యాయం జరిపిస్తా
- పెన్షన్ స్కీం కోసం పోరాడుతా
- 'సాక్షి'తో పీఆర్టీయూ టీఎస్ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: 'చట్ట సభలకు కార్పొరేట్ యాజమాన్యాల అధిపతులను పంపుతారో..? విద్య, ఉపాధ్యాయ, అధ్యాపక రంగాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండి, ఏళ్ల తరబడి ఆయా రంగాల్లో పని చేస్తూ.. ఉద్యోగుల సంక్షేమం కోసం పోరాడుతున్న తనలాంటి సేవకుడిని పంపుతారో? విజ్ఞులైన ఉపాధ్యాయ ఓటర్లే ఆలోచించాలి' అని హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల ఉపాధ్యాయ శాసన మండలి పీఆర్టీయూ టీఎస్ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి అన్నారు. ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే.. చట్టసభల్లో ఉపాధ్యాయ, అధ్యాపకుల గొంతుకనవుతానని చెప్పారు. ఈనెల 13న నిర్వహించనున్న ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం ఆయన 'సాక్షి' ప్రతినిధితో ప్రత్యేకంగా మాట్లాడారు. జీఓ నంబర్ 317 ద్వారా నష్టపోయిన బాధితులను తిరిగి వారి సొంత జిల్లాలకు రప్పించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానని స్పష్టంచేశారు. మిగిలిన వివరాలు ఆయన మాటల్లోనే..

రైతు కుటుంబంలో పుట్టా..

మాది రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మొండిగౌరెల్లి. సామాన్య రైతు కుటుంబంలో జన్మించా. ఒకటి నుంచి ఐదు వరకు మొండిగౌరెల్లి ప్రభుత్వ పాఠశాలలో, 10 తరగతి వరకు చింతపట్లలో, మలక్‌పేట్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ చదివా. న్యూసైన్స్ కాలేజీలో డిగ్రీ చదివి, ఉస్మానియా విశ్వవిద్యాయంలో పీజీ పూర్తి చేశా. వేంకటేశ్వర యూనివర్సిటీ నుంచి బీఈడీ పట్టా పొందా. 1983 డీఎస్సీలో ఉపాధ్యాయుడిగా ఎంపికై ఆదిబట్ల సమీపంలోని బొంగుళూరులో తొలిసారి విధుల్లో చేరా. ఆ తర్వాత నందివనపర్తి, చీర్యాల, ఇంజాపూర్, బాలాపూర్, శేరిగూడ, కర్మన్‌ఘట్, హయత్‌నగర్ ప్రభుత్వ పాఠశాల్లో పనిచేసి, 2018లో ఉద్యోగ విరమణ పొందా.

పీఆర్‌టీయూ కార్యకర్తగా

ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరిన నాటినుంచి పీఆర్టీయూ టీఎస్‌లో క్రియాశీలకంగా పని చేశా. రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా, తెలంగాణ టీచర్స్ జేఏసీ చైర్మన్‌గా, పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉపాధ్యాయులకు సేవలందించా. మహిళా ఉపాధ్యాయులకు అదనంగా ఐదు సీఎల్‌లు, 180 రోజుల ప్రసూతి సెలవులు, 90 రోజుల చైల్డ్‌కేర్ లీవ్స్, అప్రెంటిస్ టీచర్లకు రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు, ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లిష్, ఫిజికల్ సైన్స్ పోస్టుల మంజూరు, దేశంలోనే తొలిసారిగా బదిలీల్లో వందశాతం కౌన్సెలింగ్ విధానం, జీఓ నంబర్ 40 ద్వారా హెచ్ఎం, ఎంఈఓలకు అధికారాలు, 2008లో 13 రోజుల సమ్మె, 2011లో 32 రోజుల సకల జనుల సమ్మె కాలానికి పూర్తి వేతనం ఇప్పించడంలో కీలక పాత్ర పోషించా.

పెన్షన్ స్కీం కోసం ఒత్తిడి తెస్తా

ఉపాధ్యాయుడిగా, సంఘం ప్రతినిధిగా ఏళ్ల పాటు పని చేసిన అనుభవం ఉంది. ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి, ఉపాధ్యాయుల సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉంది. ఎమ్మెల్సీగా గెలిపించి చట్ట సభలకు పంపితే.. అదే స్ఫూర్తితో ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తా. స్కూళ్లలో వసతులు కల్పించడంతో పాటు ఖాళీ పోస్టుల భర్తీ, ఉద్యోగుల పెన్షన్ స్కీం కోసం పోరాడుతా.

కనుల పండువగా సందల్ ఊరేగింపు



చాదర్ తీసుకెళ్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

- వందలాదిగా పాల్గొన్న భక్తులు
- చాదర్ సమర్పించిన ఎంపీ రంజిత్‌రెడ్డి

పహాడీషరీఫ్: మర్ఫా వాయిద్యాలు, బ్యాండ్ మేళాలు.. వీటికి అనుగుణంగా యువకుల నృత్యాలు.. ఒంటెలపై మహబూబ్ సుభానీ జెండాల ఊరేగింపు... ఫకీర్ల జర్బ్‌ల విన్యాసాలు.. గుర్రాలపై చిన్నారుల సందడి నడుమ పహాడీషరీఫ్ బాబా షర్ఫుద్దీన్ దర్గా సందల్ ఊరేగింపు శుక్రవారం వేకువజామున కనుల పండువగా కొనసాగింది. 757వ ఉర్సు వేడుకల్లో భాగంగా బాలాపూర్‌లో బాబా అడుగిడిన నివాసం నుంచి గురువారం అర్థరాత్రి ప్రత్యేక ప్రార్థనల అనంతరం సందల్ ఊరేగింపు ప్రారంభమైంది. గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించిన అనంతరం కొత్తపేట, వెంకటాపూర్, షాహిన్‌నగర్, జల్‌పల్లి కమాన్‌ల మీదుగా ఉదయం 8 గంటలకు పహాడీషరీఫ్ దర్గాకు చేరుకుంది. అనంతరం గంధంను కొండపై ఉన్న షర్ఫుద్దీన్‌బాబా సమాధిపై ఉంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి హాజరై తలపై పూలు, చాదర్‌తో కొండపైకి ఎక్కి బాబా సమాధిపై చాదర్ సమర్పించారు. వేలాది మంది పాల్గొంటున్న ఊరేగింపు కావడంతో పహాడీషరీఫ్, బాలాపూర్ పోలీసులు అదనపు బలగాలతో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. మహేశ్వరం డీసీపీ సి.హెచ్.శ్రీనివాస్, ఏసీపీ సి.అంజయ్య, పహాడీషరీఫ్, బాలాపూర్‌ల ఇన్‌స్పెక్టర్లు కిరణ్ కుమార్, భాస్కర్ అదనపు బలగాలతో బందోబస్తును పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు కొండల్ యాదవ్, దస్తగి ర్, అబ్దుల్లా బిన్ అవద్ తదితరులు పాల్గొన్నారు.

'పది' సాధిస్తే.. విమానం ఎక్కిస్తా

ఆమనగల్లు: మాడ్గుల మండలంలోని తొమ్మిది ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న టెన్త్ విద్యార్థుల్లో పది జీపీఏ సాధించిన వారిని విమానం ఎక్కిస్తానని నర్వ మాజీ సర్పంచ్, సింగిల్‌విండో చైర్మన్ బంగ్ల లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. ఇర్విన్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సైకాలజిస్ట్ శ్రీనివాస్‌తో విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం లక్ష్మీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. పది పాయింట్లు సాధించిన వారిని కాశీ నుంచి కన్యాకుమారి వరకు ఫ్లైట్‌లో తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సర్దార్‌నాయక్, హెచ్‌ఎం విజయభాస్కర్ రెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్, నాయకులు వెంకటయ్య, నర్సింహా, కృష్ణయ్య, శ్రీదర్‌గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఇర్విన్‌లో మాట్లాడుతున్న లక్ష్మీకాంత్‌రెడ్డి

నకిలీ బంగారం ఇచ్చి.. రూ. లక్షకు టోకరా

మీర్‌పేట: నకిలీ బంగారం ఇచ్చి లక్ష రూపాయలతో ఉడాయించిన సంఘటన మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ మహేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. బడంగ్‌పేట జయశంకర్ కాలనీకి చెందిన మాలకొండయ్య (39) టీకేఆర్ కళాశాల వద్ద జ్యూస్ సెంటర్ నడుపుతున్నాడు. ఈ నెల 3న ఓ గుర్తు తెలియని వ్యక్తి దుకాణం వద్దకు వచ్చి తన వద్ద అసలైన, నాణ్యత కలిగిన బంగారు బిస్కెట్ ఉందని, దీని ఖరీదు లక్ష రూపాయలు అని చెప్పాడు. ఇది నమ్మిన మాలకొండయ్య సదరు వ్యక్తికి రూ.1 లక్ష ఇచ్చి బంగారు బిస్కెట్‌ను తీసుకున్నాడు. సదరు వ్యక్తి వెళ్లిపోయిన తర్వాత మాలకొండయ్య సమీపంలోని నగల దుకాణానికి వెళ్లి పరీక్ష చేయించగా నకిలీదని తేలింది. తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు శుక్రవారం పీఎస్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్ఎస్ పార్టీ నుంచి కవితను సస్పెండ్ చేయాలి

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు

షాద్‌నగర్: లిక్కర్ స్కామ్‌లో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ కవితను సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన షాద్‌నగర్‌లో మాట్లాడుతూ.. గతంలో రాజయ్య, ఈటల రాజేందర్‌కు ఎలాంటి శిక్ష విధించారో కవితకు కూడా అలాంటి శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. అవినీతికి పాల్పడితే సొంత కొడుకునైనా, కూతురినైనా క్షమించను అన్న కేసీఆర్ మాటలు ఇప్పుడు ఏమయ్యాయని ప్రశ్నించారు. బీజేపీ గురించి మాట్లాడిన వారంతా కాల గర్భంలో కలిసిపోయారన్నారు. దేశవ్యాప్తంగా తెలంగాణ అంటే మద్యం పారే రాష్ట్రంగా పేరు వస్తోందని, లిక్కర్ స్కాంలో కవిత పేరు రావడం రాష్ట్ర ఖ్యాతిని మరింతగా దిగజార్చాయని మండిపడ్డారు. నేరం చేసే వాళ్లు ఎవరైనా శిక్ష అనుభవించక తప్పదని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి, తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పవన్ హత్య కేసు దర్యాప్తు ముమ్మరం

పహాడీషరీఫ్: సంచలనం సృష్టించిన పవన్ నాయక్ హత్య కేసు దర్యాప్తును బాలాపూర్ పోలీసులు వేగవంతం చేశారు. గిరిజన యువకులపై వరుసగా జరుగుతున్న దాడులు, హత్యలను నిరసిస్తూ సదరు కుల సంఘాలు ఆందోళనలకు దిగడంతో కేసులో ప్రమేయమున్న నిందితులను గుర్తించే పనిలో పడ్డారు. మొదటి నుంచి అందరూ అనుకున్నట్లుగానే ప్రేమ వ్యవహారమే పవన్ హత్యకు దారితీసినట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. హత్యతో ప్రత్యక్ష ప్రమేయమున్న ఇద్దరిని ఇప్పటికే అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఈ ఘటనకు ఎవరైనా ప్రేరేపించారా..? అనే కోణంలో కూడా కూపీ లాగుతున్నారు. ఈ క్రమంలోనే మరి కొందరు కుటుంబ సభ్యులను కూడా విచారిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా నిందితులను శనివారం అధికారికంగా మీడియాకు చూపించనున్నట్లు తెలిసింది.

రాజీ ప్రతిపాదనపై నజర్

ప్రేమ వ్యవహారంలో రూ.3 లక్షలు చెల్లించేలా రాజీకుదిర్చే ప్రతిపాదనపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ డీల్ లేకుంటే.. పవన్ కేసులో ఇరుక్కొని జైలు జీవితం మాత్రమే గడిపేవాడు. కానీ డబ్బుల ప్రతిపాదన కారణంగా.. ఏకంగా అతని ప్రాణాలు పోగొట్టే పరిస్థితిపై బంధుమిత్రులు తీవ్రంగా మండిపడుతున్నారు. ఈ క్రమంలోనే పోలీసులు ఈ డీల్ వెనుక ఉన్న పెద్ద మనుషులు ఎవరని ఆరా తీస్తున్నారు. నాలుగేళ్ల క్రితం పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా గిరిజన మహిళపై జరిగిన ఘటనలో డబ్బుల రాజీ కుదిర్చిన ఘటనలో చివరకు పది మంది పెద్ద మనుషులను పోలీసులు రిమాండ్ చేశారు. ప్రస్తుతం కూడాఅదే జరుగుతుందో.. లేదో చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఏది ఏమైనా ప్రేమ వ్యవహారంలో యువకుడి ప్రాణం పోయింది.

'చందన'లో అద్భుతమైన వెరైటీలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన చందన బ్రదర్స్ షాపింగ్ మాల్‌ను శుక్రవారం ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, సినీ నటి హనీ రోజ్ ప్రారంభించారు. పరిగి రోడ్డులోని పోచమ్మ ఆలయం ఎదుట అన్ని హంగులతో అందుబాటులోకి వచ్చిన మాల్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకుడు అల్లక సత్యనారాయణ కోరారు. మాల్‌లో అద్భుతమైన వెరైటీలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన వస్త్రాలు ఉన్నాయన్నారు. నటి హనీరోజ్‌ను చూసేందుకు జనం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ నట్‌రాజన్, కౌన్సిలర్ ప్రతాప్‌రెడ్డి, నాయకులు జూపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



కేశంపేట మండలంలో కొనసాగుతున్న విశారదన్ మహరాజ్ పాదయాత్ర

రాష్ట్రంలో అసమర్థ పాలన

డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్

కేశంపేట: రాష్ట్రంలో అసమర్థ పాలన సాగుతోందని డీఎస్పీ(దళిత శక్తి ప్రోగ్రాం) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ ఆరోపించారు. పదివేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్రలో భాగంగా శుక్రవారం మండలంలోని చౌలపల్లి, కేశంపేట, అల్వాల, ఎక్లాస్‌ఖాన్‌పేట, సంగెం ఫరూఖ్‌నగర్ మండలంలోని వెలిజర్ల, కొండన్నగూడెం గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో డీఎస్పీ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 90శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాధికారం దక్కాలని అన్నారు. కేసీఆర్ పాలనలో పీహెచ్‌డీలు చేసిన వారు పెయింటింగ్ పనికి, బీటెక్ చేసిన వారు కూలీ పనులకు వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఆత్మగౌరవంతో బతికేందుకు డీఎస్పీ కృషి చేస్తుందన్నారు. అణగారిన కులాలను విజేతలుగా మార్చి అధికారంలోకి తెచ్చేందుకే ఈ పాదయాత్రని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాకేష్, మండల అధ్యక్షుడు శివ, నాయకులు మహిపాల్, రవి, కృష్ణ, రమేష్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు ఉద్యోగ సంఘాల వత్తాసు

విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న సర్కార్

- ఎమ్మెల్యే రఘునందన్‌రావు ధ్వజం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

షాద్‌నగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యా వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించారని బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ శాసన మండలి ఉపాధ్యాయ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం షాద్‌నగర్‌లో టీపీయూఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఉపాధ్యాయ, అధ్యాపక ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఎనిమిది సంవత్సరాలుగా ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. ఒక్క ఉపాధ్యాయ పోస్టును కూడా భర్తీ చేయకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక ఏ ఉపాధ్యాయ సంఘం కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నించడం లేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. 317 జీఓ తీసుకొచ్చి ఉపాధ్యాయులను ప్రభుత్వాలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందని ఆరోపించారు. ఉపాధ్యాయ హక్కులను ప్రభుత్వం కాలరాస్తుందని మండిపడ్డారు. ఉద్యోగ సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలన్నీ కేసీఆర్‌కు వత్తాసు పలుకుతున్నాయని విమర్శించారు. గతంలో గెలిచిన ఎమ్మెల్సీలు ప్రభుత్వానికి అనుకూలంగానే వ్యవహరించారని చెప్పారు. శాసన మండలిలో ప్రశ్నించే గొంతుక అయిన తపస్, బీజేపీ బలపర్చిన అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డిని ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టం కట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలో ఓటమి చెందుతా మని భయంతోనే సీఎం కేసీఆర్ ఎమ్మెల్సీ అభ్యర్థిని నిలబెట్టలేదని విమర్శించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి, తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, భాగ్యవతి, సుమరంజని, అందె బాబయ్య, దేపల్లి అశోక్‌గౌడ్, కక్కునూరి వెంకటేష్‌గుప్త, సుదర్శన్‌రెడ్డి, భూపాలాచారి, విష్ణువర్ధన్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, నర్సింహాగౌడ్, వెంకటేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మహిళ అదృశ్యం



లక్ష్మి(ఫైల్)

చేవెళ్ల: మతిస్థిమితం లేని మహిళ కనిపించకుండా పోయింది. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కందవాడ గ్రామంలో ఈ నెల 6న చోటు చేసుకుంది. ఎస్‌ఐ హయ్యూమ్ కథనం మేరకు.. కందవాడకు చెందిన లక్ష్మి(42) ఈ నెల 6న ఇంట్లో ఎవ్వరికి చెప్పకుండా బయటకి వెళ్లింది. ఆమె కోసం కుటుంసభ్యులు పలు ప్రాంతాల్లో వెతికిన ఆచూకీ లభించలేదు. దీంతో భర్త మాణిక్యం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కార్మికుడి మృతి

మొయినాబాద్: విద్యుత్ స్తంభాన్ని ఎక్కుతుండగా ఫిట్స్ రావడంతో కిందిపడి పంచాయతీ కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని ఎన్కేపల్లిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఎన్కేపల్లికి చెందిన బాకారం సుమన్(27) గ్రామ పంచాయతీ సిబ్బందిగా పనిచేస్తున్నాడు. గురువారం కనెక్షన్ ఇచ్చేందుకు విద్యుత్ స్తంభం ఎక్కాడు. ఫిట్స్ రావడంతో పైనుంచి కింద పడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

మహిళలకు అండగా కేసీఆర్ సర్కార్

- ప్రభుత్వ పథకాల్లో మహిళలకే ప్రాధాన్యం
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: కేసీఆర్ ప్రభుత్వం మహిళలకు అండగా నిలబడుతోందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. ఎంకేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం, సావిత్రిబాయి పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక వీకే ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మహిళలకు పెద్ద పీట వేస్తోందని తెలిపారు. మహిళల భద్రత కోసం షీ టీమ్స్ ఏర్పాటు చేశారన్నారు. డాక్టర్ ప్రీతి మరణం వంటి సంఘటనలు దురదృష్టకరమని.. మహిళలు ధైర్యాన్ని కోల్పోకుండా షీటీమ్స్‌ను ఆశ్రయించాలని సూచించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం పోరాడుతున్న ఎమ్మెల్సీ కవితపై కేంద్రం కక్షసాధింపు చర్యలకు దిగుతోందని ఆరోపించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి, ఎంపీపీలు నర్మద, కృపేష్, జెడ్పీటీసీ జంగమ్మ, నేతలు మమత, మాధవి, అశ్విని, సంతోష, రేణుక, రాములు పాల్గొన్నారు.

రైతు రుణాలకు ప్రాధాన్యం

ఏపీజీవీబీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్

ఆమనగల్లు: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్‌బ్యాంక్ రైతులకు రుణాలు అందించడంలో ప్రాధాన్యత ఇస్తున్నామని ఏపీజీవీబీ చైర్మన్ కొండూరు ప్రవీణ్ కుమార్ చెప్పారు. ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామంలో ఏపీజీవీబీ శాఖ నూతన భవన నిర్మాణ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అంతకుముందు బ్యాంకు భవన నిర్మాణానికి స్థలం దానం చేసిన దాతలు శ్రీపాతి రాజిరెడ్డి, జంగారెడ్డిలను చైర్మన్ ఘనంగా సత్కరించారు. పీఎంజేజేవై పథకం కింద మంజూరైన చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. రైతులకు, మహిళా సంఘాలకు పెద్దఎత్తున రుణాలు అందిస్తున్నామని వివరించారు. తీసుకున్న రుణాలతో ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఏపీజీవీబీ రీజనల్ మేనేజర్ భీమ్‌సేన్‌రావ్, ఆకుతోటపల్లి శాఖ మేనేజర్ శశిధర్‌రెడ్డి, సర్పంచ్ రజిత పాల్గొన్నారు.

ఆటోలో చెలరేగిన మంటలు

ప్రయాణికులు లేకపోవడంతో తప్పిన ముప్పు



మంటల్లో కాలిపోతున్న ఆటో

షాద్‌నగర్ రూరల్: రోడ్డుపై ఆగి ఉన్న సెవెన్ సీటర్ ఆటోలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఆ సమయంలో ప్రయాణికులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటన శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలోని పాత జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి... శంషాబాద్ మండలం పెద్దతుప్పర గ్రామానికి చెందిన కుమార్ తన ఆటోలో ప్రయాణికులను చేరవేస్తుంటాడు. శుక్రవారం మధ్యాహ్నం ప్రయాణికులను షాద్‌నగర్‌లో దించి రోడ్డు పక్క ఆటో ఆపి భోజనం చేసేందుకు వెళ్లాడు. ఉన్నట్టుండి ఆటోలో నుంచి మంటలు చెలరేగాయి. మంటలు పెద్ద ఎత్తున వ్యాపించడంతో స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పట్టణ సీఐ నవీన్‌కుమార్ తెలిపారు.

దొంగ అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

షాబాద్: ఇంట్లో ఎవరూ లేని సమయంలో బంగారు ఆభరణాలు చోరీ చేసిన వ్యక్తిని పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు షాబాద్ సీఐ గురువయ్యగౌడ్, ఎస్‌ఐలు మహేశ్వర్‌రెడ్డి, బాల్‌రాజ్ తెలిపారు. శుక్రవారం ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ వెల్లడించారు. మండలంలోని పోతుగల్ గ్రామానికి చెందిన కేశపల్లి సుజాత ఈ నెల 4వ తేదీ రాత్రి 12 గంటల సమయంలో తన పా లంలో గులాబీ పూలు కోసేందుకు కొడుకుతో కలిసి వెళ్లింది. రాత్రి రెండు గంటలకు ఇంటికి వచ్చారు. గ్రామానికి చెందిన నవీన్‌రెడ్డి.. సుజాత ఇంటి ప్రహరీ దూకి వెళ్ల డాన్ని పక్కింటి వాళ్లు చూశారు. ఈ విషయాన్ని ఆమెకు తెలిపారు. సుజాత ఇంట్లోకి వెళ్లి అల్మారా తెరిచి చూడగా నాలుగు తులాల బంగారం నెక్లెస్ కనపడలేదు. ఈ విష యాన్ని ఆమె షాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు నవీన్‌రెడ్డిని అదుపులోకి తీసుకొని విచారించా రు. దొంగిలించిన నాలుగు తులాల బంగారం నెక్లెస్‌ను స్వాధీనం చేసుకొని, నిందితున్ని రిమాండ్‌కు తరలించారు.

మల్లారెడ్డిని మండలికి పంపుదాం

టీయూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునందన్‌రెడ్డి



మహారాజ్‌పేట్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రచారం నిర్వహిస్తున్న రఘునందన్‌రెడ్డి

శంకర్‌పల్లి: త్వరలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీయూటీఎఫ్ అభ్యర్థి దేవన్నగారి మల్లారెడ్డికి తొలి ప్రాధాన్యత ఓటు వేసి మండలికి పంపుదామని ఆ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునందన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ప్రొద్దటూరు, కొండకల్, టంగటూరు, పర్వేద, మహారాజ్‌పేట్, జనవాడ జిల్లా పరిషత్ పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల అనంతరం ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎనిమిది సంవత్సరాలుగా పదోన్నతులు, ఐదేళ్లుగా బదిలీలు లేక ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై పోరాడే దేవన్నగారి మల్లారెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీయూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మునీర్ పాషా, మండల కార్యదర్శులు సుదర్శన్, శ్రీనివాస్‌చారి, గౌరవ అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, వెంకటేశ్వరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక సదస్సులతో నైపుణ్యం

డీఆర్‌డీవో సైంటిస్ట్ రఘు



మాట్లాడుతున్న డీఆర్‌డీవో సైంటిస్ట్ రఘు

మొయినాబాద్ రూరల్: వైజ్ఞానిక సదస్సులు నిర్వహించడం ద్వారా విద్యార్థులల్లో నైపుణ్యం పెరుగుతుందని డీఆర్‌డీవో సైంటిస్ట్ డాక్టర్ టీ రఘు అన్నారు. శుక్రవారం మండలంలోని అమ్డాపూర్ జేబీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో జేబీ విద్యా సంస్థల కార్యదర్శి కృష్ణారావు ఆధ్వర్యంలో అడ్వాన్స్‌డ్ అప్లికేషన్స్ ఆఫ్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్(ఏఏటీఎం)-2023 పేరుతో అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రఘు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సదస్సులు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో ఉన్న సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో స్నేహ భావం పెరిగి కొత్త కొత్త విషయాలు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం థాయిలాండ్ దేశ బ్యాంకాక్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కమేల్ మాట్లాడుతూ.. పరిశోధనలో టెక్నాలజీలు ఎంతో పెరిగిపోయాయని తెలిపారు. విద్యార్థులు నూతన టెక్నాలజీలో కొత్త విధానాలతో దూసుకుపోవాలన్నారు. ఈ సదస్సులో దాదాపు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణమాచారి, డాక్టర్ నీరజ్ ఉపాధ్యాయ్, డాక్టర్ సుల్తానా, డాక్టర్ పి.కె.ప్రదాన్, శ్రీరాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.